క్లుప్తంగా

జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని క్రైస్తవులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రేమ భావాన్ని, సేవాతత్పరత, క్షమాగుణాన్ని బోధించిన క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా అందరికీ శుభం చేకూరాలని ప్రభువును ప్రార్థిస్తున్నానన్నారు. క్రైస్తవులందరూ కుటుంబ సమేతంగా సంతోషంతో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సీడీపీఓ రమాదేవి



చిన్నారులతో రమాదేవి తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): రిలాన్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని చేర్యాల సీడీపీఓ రమాదేవి అన్నారు. మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు మంగళవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలు మరింత మందికి ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

మిరుదొడ్డి(దుబ్బాక): పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవడానికి ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి మోహన్ లాల్ సూచించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని జంగపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భస్థకోశ చికిత్సలు నిర్వహించి, వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, సూపర్‌వైజర్ సత్తార్, గోపాల మిత్రలు పరశురాములు, లక్ష్మణ్, వీఏ బాబూమియా, ఓఎస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే వేగవంతం

ఎంపీడీఓ భానోతు జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ భానోతు జయరాం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలో కొనసాగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించారు. దాదాపు 45 శాతం సర్వే పూర్తయిందని, ఈ నెలాఖరు కల్లా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించామన్నారు. ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వీసీ తనిఖీ



పరిశీలిస్తున్న వీసీ ఉమేశ్‌కుమార్

హుస్నాబాద్: శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రిన్సిపాల్ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి

- ప్రారంభమైన పండుగ శోభ
- విద్యుత్ దీపాలతో వెలుగుతున్న చర్చిలు



మద్రే చర్చిలో కేక్ కట్‌చేస్తున్న పాస్టర్ జ్ఞానకుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: యేసుక్రీస్తు జన్మదినానికి శుభసూచికగా జరుపుకునే క్రిస్మస్ పండుగ సందడి నెలకొంది. సిద్దిపేటలోని సీఎస్ఐ, మద్రే, బెరాకా తదితర చర్చిలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ ట్రీ, పశువుల పాక, శిలువల వద్ద ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు బుధవారం సందర్శించుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యుత్ వెలుగులతో సిద్దిపేట పట్టణంలోని చర్చిలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. అదేవిధంగా దుబ్బాకటౌన్ రాయపోల్ మండల పరిధిలోని ముంగాజీపల్లి, ఆరెపల్లి తిమ్మక్‌పల్లి, అనాజీపూర్, కొత్తపల్లి, రామారం, బేగంపేట గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు.



దుబ్బాకటౌన్: విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న చర్చి

క్రిస్మస్ ఎంతో పవిత్రమైనది



ప్రపంచంలోని క్రైస్తవులందరికీ క్రిస్మస్ వేడుక ఎంతో పవిత్రమైనది. ఈ పండుగ జీవితంలోని పరమార్థాన్ని తెలుపుతుంది. యేసుప్రభువు జన్మదిన శుభసూచికగా జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. ప్రతి మానవుడు ఇతరులను ప్రేమించాలన్నదే ప్రభువు చెప్పిన నిత్య సత్యం. ఎల్లప్పుడు ఆదయామయుడి ఆశీర్వాదాలు అందరిపైనా ఉంటాయి.

– రెవరెండ్ ఆంథోని, సీఎస్ఐ చర్చి పాస్టర్, సిద్దిపేట

సంతోషంగా జరుపుకొనే వేడుక



క్రిస్మస్‌ను మేము ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటాం. ప్రతి క్రైస్తవుడు ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలి. దేవుడిచ్చిన మార్గదర్శకంలో అందరం నడవాలి. సంతోషంగా జీవితం గడపాలని ఆ దేవుడిని కోరుకుంటాం. కేక్‌లు, బహుమతులు పంచుకుంటాం. ప్రతి క్రైస్తవ కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుకుంటాం.

– స్టీవెన్ జ్ఞానకుమార్, మద్రే చర్చి పాస్టర్, సిద్దిపేట



వేడుకలకు సిద్ధమైన సిద్దిపేట సీఎస్ఐ చర్చి





దుకాణాలలో విక్రయిస్తున్న శాంతాక్లాజ్ తాతయ్య బొమ్మలు, దుస్తులు, స్టార్‌లు, ఇతర సామగ్రి

క్రీడలకు పుట్టినిల్లు 'అక్కన్నపేట'

- ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు
- ఎస్ఐ విజయ్‌భాస్కర్



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ విజయ్‌భాస్కర్

అక్కన్నపేట(హుస్నాబాద్): క్రీడలకు అక్కన్నపేట మండలం పుట్టినిల్లని ఎస్ఐ విజయ్‌భాస్కర్ కొనియాడారు. మండలంలోని అంతక్కపేటలో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిభ ఉండి ప్రోత్సాహం కరువైన క్రీడాకారులను వెలికితీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అయిలయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య, క్రీడా సమాఖ్య మాజీ కార్యదర్శి సుజాత, శ్రీనివాస్, చౌటపల్లి మాజీ సర్పంచ్ రమేశ్, దాము, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి, భద్రతల పరిరక్షణే ధ్యేయం

ఏసీపీ మధు



కవాతు చేస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

సిద్దిపేటకమాన్: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని ఏసీపీ మధు అన్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి సిద్దిపేటలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏదైనా శాంతి, భద్రతల సమస్య, మత ఘర్షణలు తలెత్తినప్పుడు వెంటనే ఈ ఫోర్స్ వచ్చి పోలీసులకు సహకరించి బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతకే అధిక ప్రాధాన్యం

కమిషనర్ రమేశ్‌కుమార్



డీఆర్‌సీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమేశ్

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీలో స్వచ్ఛతకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేశ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని లచ్చపేట శివారులోని డీఆర్‌సీసీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించి తడి, పొడిచెత్త సేకరణ, నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌సీసీ కేంద్రంలో తడి, పొడిచెత్తను వేరుచేసి వాటితో సేంద్రియ ఎరువును తయారుచేసే ప్రక్రియ చేపడుతున్నామన్నారు. వార్డుల్లోని ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడిచెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలు, బహిరంగ స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయకుండా స్వచ్ఛ దుబ్బాకకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు అనిల్‌రెడ్డి, దిలీప్ తదితరులు ఉన్నారు.

కాపర్ వైరు ఆయిల్ చోరీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైరు, ఆయిల్ చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని గొల్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. రైతుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిగుళ్ల నర్సింహులుకు చెందిన పొలం వద్ద 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ ఉదయం కింద పడి, ఖాళీగా ఉండడాన్ని రైతులు గుర్తించారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఏఈ శివశంకర్ ఘటనాస్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. కాపర్ వైరు, ఆయిల్ చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

గుర్తుతెలియని జంతువు దాడి: మేకపిల్లల మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): గుర్తుతెలియని జంతువుదాడిలో నాలుగు మేకపిల్లలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు జక్కుల మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే తన పొలం వద్ద మేకపిల్లలను ఉంచాడు. ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని జంతువు దాడి చేయడంతో నాలుగు మేకపిల్లలు చనిపోగా మరో నాలుగు ప్రాణాపాయస్థితిలో ఉన్నాయి. రూ.50వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మల్లయ్య కోరాడు.

విత్తనోత్పత్తి పంటలతో అధిక ఆదాయం: ఏఓ

సిద్దిపేటఅర్బన్: విత్తనోత్పత్తి పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మంగళవారం విత్తనోత్పత్తి కోసం సాగు చేస్తున్న వరి నారుమడులను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేయర్ కంపెనీకి చెందిన హైబ్రిడ్ రకాన్ని సుమారు పది ఎకరాలలో విత్తనోత్పత్తి చేపడుతున్నారని, ఎకరాకు 8–12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. క్వింటాలుకు రూ.12వేలు కంపెనీ చెల్లించి ధాన్యాన్ని సేకరిస్తుందని తెలిపారు. పంటబీమా సౌకర్యం ఉండడం వల్ల రైతులకు నష్టం ఉండదని చెప్పారు. జిబ్బరెల్లిక్ యాసిడ్ పిచికారీ చేసుకుంటే తొందరగా పుష్పిస్తాయని తెలిపారు. ఆయన వెంట ఏఈఓ రాజేశ్ ఉన్నారు.

మొజాయిక్ వైరస్‌తో బీన్స్‌కు నష్టం: ఏఈఓ

తొగుట(దుబ్బాక): బీన్స్ సాగులో మొజాయిక్ వైరస్ నివారించకపోతే తీవ్రమైన నష్టం జరుగుతుందని ఏఈఓ నాగార్జున సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతు మెట్టు మల్లయ్య సాగుచేసిన బీన్స్ పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వైరస్ గురించి అవగాహన కల్పించారు. దాని నివారణకు చేలో పసుపు పచ్చరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేశారు. ఎకరాకు 5 నుంచి 6అట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అట్టపై అంటుకున్న పురుగుల సంఖ్యను బట్టి ఎసీఫేట్ అనే మందు ఎకరానికి 300గ్రాములు 200లీటర్లలో కలిపి పంటకు స్ప్రే చేయాలని రైతులకు వివరించారు. ఈ బుట్టల ఏర్పాటుతో 30శాతం పంటకు పురుగుమందు వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఎల్లారెడ్డిపేట క్లస్టర్ పరిధిలో 60ఎకరాలు బీన్స్ పంటను రైతులు సాగు చేశారని తెలిపారు.

31లోగా పనులు పూర్తి చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులను 31లోగా పూర్తిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల నిర్వహణ తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాంప్లెక్స్‌లకు రంగు లు వేసే పనులను పూర్తిచేయాల న్నారు. బస్టాండ్ ఆవరణలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా దుకాణాలు కోల్పోతున్న వారితో మాట్లాడారు. వారికి నష్టం కలుగకుండా పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: ఎస్ఐ

దుబ్బాకటౌన్: డ్రగ్స్ గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి యువత, ప్రజలు సహకరించాలని రాయపోల్ మండలం బేగంపేట ఎస్ఐ మహిపాల్ అన్నారు. పీఎస్ పరిధిలోని పలు దుకాణాల్లో నార్కోటిక్ డాగ్స్‌తో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాశెట్టి నరేశ్, సిల్వేరి ఆంజనేయులు కిరాణా దుకాణాలలో విక్రయిస్తున్న గుట్కా, అంబర్ ప్యాకెట్స్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఏఎస్ఐ ప్రేమ్, నార్కోటిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: రవీందర్

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ మాజీ అధ్యక్షుడు దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో అనంత నగేశ్, కంకణాల రామస్వామికి మంజూరైన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌చారి, బచ్చలి మహిపాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటకమాన్: అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం వేరువేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈశ్వర్, వెంకటేశ్వర్లు, నరేశ్, రాజు, లింగం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, మార్క సతీశ్‌కుమార్, ఆనంద్,లక్ష్మి మాట్లాడుతూ అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.

అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలి

దుబ్బాక: తొక్కిసలాటలో మృతిచెందిన బాధిత కుటుంబానికి హీరో అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, పోలీసులకు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో కనకయ్య యాదవ్, భూపాల్‌రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, మల్లయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

పొద్దుతిరుగుడు, మొక్కజొన్నపై అవగాహన

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి, చౌటకుంట తండా, పంతుల్‌తండాల్లో మంగళవారం వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న రైతులకు అవగాహన కల్పించారు. సందర్భంగా వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా మాట్లాడుతూ మొక్కజొన్న పంటల్లో మొగిపురుగు, కత్తెరపురుగు ఎక్కువగా ఆశించిందని గుర్తించామన్నారు. అఇఇని నివారణకు ఇమామెక్టిన్ బెంజాయేట్ 80మీ.లి+వేప నూనెను 100లీ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. లేదా మోగిలో కార్బోఫ్యూరన్ 36గుళికలు వేయడం వల్ల పురుగు ఉధృతిని తగ్గించవచ్చు అన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ పల్లవి, రైతులు గుగులోతు రాజు, శంకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటం

గజ్వేల్: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన జంగ యాదగిరికి రూ.50వేల బీమా చెక్కును మంగళవారం గజ్వేల్‌లో అందజేశారు. ఆటోడ్రైవర్ల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, నర్సింగరావు, నాగేష్‌కుమార్, కనకయ్య పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వాళ్లకే గుర్తింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని కాపాడిన వాళ్ళకే గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణానికి చెందిన పుట్ల ప్రసాద్, గుర్రాల గొంది గ్రామానికి చెందిన ఎర్ర హరీశ్‌కు కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్‌లుగా బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ యేసు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కిసాన్ సెల్ జనరల్ సెక్రెటరీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్'పై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి రైతుకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఉద్యాన అధికారి రమేశ్ అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ లోహిత్, ఆయిల్‌ఫెడ్ అధికారి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ మానస్ రంజిత్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి

కొండపాక(గజ్వేల్): గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. సీఎం కప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజేతలైన మండల పరిధిలోని కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థులను ఆయన మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమేనని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ క్యాతం రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.